క్లుప్తంగా

నేడు ఓబీసీ మోర్చా నిరసన

మోతీనగర్: బీసీ బంధును కొన్ని కులాలకే కాకుండా బీసీలలోని కులాలకు ఇవ్వాలని జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు పులిగొళ్ల శ్రీనివాస్‌యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఉదయం 10 గంటలకు కూకట్‌పల్లి వై జంక్షన్‌లో నిరసన చేపట్టనున్నట్లు ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. ఈ దీక్షకు ముఖ్య అతిధులుగా ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆలే భాస్కర్‌రాజు, బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్, జిల్లా అధ్యక్షుడు మంగేష్, తదితరులు పాల్గొనున్నట్లు తెలిపారు.

సీసీరోడ్డును త్వరగా అందుబాటులోకి తేవాలి

ఆల్విన్‌కాలనీ: డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ, రాజీవ్‌గాంధీ నగర్‌లో రూ.7లక్షలతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును శుక్రవారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయన్నారు. సీసీ రోడ్డుకు క్యూరింగ్ చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సమ్మారెడ్డి, శివరాజ్‌గౌడ్, మల్లేష్, ముజీబ్, ఫారూఖ్, ఇంతియాజ్, సతీష్, సాయిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేతాజీకి నివాళి



నేతాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పన్నాల హరీష్‌రెడ్డి, నాయకులు

మూసాపేట: నేతాజీ సుభాష్ చంద్రబోస్ వర్ధంతిని శుక్రవారం జనతానగర్‌లో బీజేపీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి మాట్లాడుతూ.. ఒకవైపు గాంధీజీ మొదలగు నాయకులంతా అహింసా వాదంతోనే స్వరాజ్యం సిద్ధిస్తుందని నమ్మి పోరాటం సాగిస్తే... బోస్ మాత్రం సాయుధ పోరాటంతోనే ఆంగ్లేయులను దేశం నుంచి తరిమి కొట్టవచ్చునని నమ్మి ఆచరణలో పెట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి శరణ్‌చౌదరి, మూసాపేట కార్పొరేటర్ మహేందర్, నాయకులు వినోద్, సాధు ప్రతాప్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

చిత్తారమ్మనగర్ డ్రైనేజీ లైన్ సమస్యకు పరిష్కారం

మూసాపేట: చిత్తారమ్మనగర్‌లో హైటెన్షన్ లైన్‌లో ఉన్న డ్రైనేజీ లైన్లకు తరచూ లీకేజీ ఏర్పడుతోంది. స్థానికుల ఫిర్యాదు మేరకు మాజీ కార్పొరేటర్ బాబూరావు శుక్రవారం పరిశీలించారు. వాటర్‌వర్క్స్ మేనేజర్ సలోమి దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డివిజన్‌లో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించటానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎల్లేష్, భాస్కర్‌రావు, బుచ్చి రాములు, సుశీల్‌కుమార్, నరసింహచారి, లీడర్ బాబు, రాంచందర్, సూరి తదితరులు పాల్గొన్నారు.



సమస్యను పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటర్ బాబూరావు

ఫతేనగర్ డివిజన్‌లో పాదయాత్ర చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు తిలకం దిద్ది హారతి ఇస్తున్న మహిళలు, పాల్గొన్న కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు







ప్రతి ఒక్కరికి 'డబుల్' ఇళ్లు ఇస్తాం



ఫతేనగర్‌లో జరిగిన ప్రగతి నివేదన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, భారీగా హాజరైన ప్రజలు

కూకట్‌పల్లి నియోజకవర్గంలో 'ప్రజల వద్దకే మన ఎమ్మెల్యే'కార్యక్రమం జోరుగా సాగుతోంది. కొన్ని రోజులుగా ఫతేనగర్ డివిజన్‌లో కొనసాగుతున్న పాదయాత్ర శుక్రవారం ముగిసింది. ఈ డివిజన్‌లో పాదయాత్ర ముగింపు సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రగతి నివేదన సభను నిర్వహించారు. ఈ సభకు డివిజన్ ప్రజలతో పాటు వేల సంఖ్యలో మహిళలు పాల్గొనడం విశేషం. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నియోజకవర్గ అభివృద్ధిపై ప్రసంగించారు.



- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- గౌతమ్‌నగర్‌లో ప్రగతి నివేదన సభ
- భారీగా హాజరైన ప్రజలు, నాయకులు
- అభివృద్ధి చూసి ఓటు వేయాలని అభ్యర్థన
- ఫతేనగర్ డివిజన్‌లో ముగిసిన పాదయాత్ర

బాలానగర్: పాదయాత్రలో భాగంగా శుక్రవారం ఫతేనగర్ డివిజన్‌లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పర్యటించారు. కాలనీలో ఎమ్మెల్యేకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. పలువురు మహిళలు హారతులు ఇచ్చి ఆశీర్వదించారు. మీ పాలన బాగుందని, తిరిగి మీరే ఎమ్మెల్యేగా రావాలని పలువురు ఆకాంక్షించారు. శివశంకర్‌నగర్, ఎల్‌బీఎస్‌నగర్, ఇందిరాగాంధీ పురంలో ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి వారికి అందుతున్న పథకాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అర్హులందరూ ప్రభుత్వ పథకాలను వినియోగించుకొని లబ్ది పొందాలని సూచించారు.

◆ విడతల వారీగా ఇళ్లు ఇస్తామని హామీ..

ఫతేనగర్ డివిజన్‌లోని గౌతమ్‌నగర్‌లో కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ప్రగతి నివేదన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. తొమ్మిదిన్నర సంవత్సరాలుగా కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేశామన్నారు. కోట్లాది రూపాయలు ప్రజల సంక్షేమం కోసం వెచ్చించామని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను విడతల వారీగా అందజేస్తామని సభలో హామీ ఇచ్చారు. ప్రజలు అభివృద్ధిని చూసి ఓటు వేయాలని కోరారు.

◆ బాలానగర్‌లో ట్రాఫిక్ సమస్య తీర్చాం..

బాలానగర్ ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం సుమారు రూ.400కోట్లను వెచ్చించి ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టామని తెలిపారు. రూ.100కోట్లతో ఫతేనగర్, బాలానగర్‌కు ప్రత్యేకంగా వాటర్ ట్యాంక్‌ను నిర్మించి నీటి ఎద్దడి లేకుండా చేశామని తెలిపారు. తన సొంత నిధులతో నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బ్యాగ్ కిట్లను అందజేస్తున్నానని తెలిపారు.

◆ మహిళలకు కుట్టు శిక్షణతో పాటు మెషిన్లు ఇస్తున్నాం..

నియోజకవర్గ పరిధిలోని మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ ఇస్తున్నామని పేర్కొన్నారు. అంతేకాకుండా శిక్షణ అనంతరం వారి కాళ్లపై వారు నిలబడేలా కుట్టుమెషిన్లు అందజేస్తున్నామని తెలిపారు. అదే విధంగా వృద్ధాప్య, వితంతు, ఒంటరి, వికలాంగుల పెన్షన్లు అందజేస్తున్నామని పేర్కొన్నారు. ఆడబిడ్డల పెళ్లి కోసం షాదీముబారక్, కల్యాణలక్ష్మి వంటి పథకం ద్వారా ఆర్థిక భరోసా ఇస్తున్నామని అన్నారు.

◆ ఫతేనగర్ కార్మికుల ఆకలి తీర్చాం..

ఫతేనగర్‌లో కార్మికులు ఎక్కువగా ఉండటంతో కరోనా సమయంలో అన్నపూర్ణ క్యాంటిన్ ద్వారా వేలాది మంది కార్మికుల ఆకలి తీర్చామని తెలిపారు. ఆ సమయంలో ఏ రాజకీయ పార్టీ నాయకుడు ప్రజల వద్దకు వచ్చింది లేదని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకుందన్నారు.

◆ బీజేపీ,కాంగ్రెస్‌లకు ఓటుతో బుద్ధి చెప్పాలి

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి చేసింది ఏమీ లేదని విమర్శించారు. కుల మతాల మధ్య చిచ్చు పెట్టడమే పనిగా పెట్టుకున్నారని అన్నారు. అబద్ధాలతో పబ్బం గడుపుకునే పనిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారని విమర్శించారు. ఈ రెండు పార్టీలకు ప్రజలు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి కేసీఆర్ ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వాదించాలని అభ్యర్థించారు.

21న హెచ్‌సీయూలో జాతీయ సదస్సు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో తెలుగుశాఖ, మానవీయ శాస్త్రాల విభాగం, గురజాడ ఫౌండేషన్ అమెరికా సంయుక్త ఆధ్వర్యంలో గురజాడ జాతీయస్థాయి సదస్సును ఈనెల 21వ తేదీన నిర్వహిస్తామని తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, ఆచార్యులు కొవ్వలి గోపాలకృష్ణ, పమ్మి పవన్‌కుమార్ ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపారు. మహాకవి గురజాడ అప్పారావు జీవితం, రచనలపై సదస్సును నిర్వహిస్తారు.

మనూలో 'మౌలానా ఆజాద్ ఏ లైఫ్' పుస్తకావిష్కరణ

రాయదుర్గం: భారతదేశంలో విద్యాభివృద్ధికి మౌలానా ఆజాద్ ఎంతో కృషి చేశారని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో మౌలానా ఆజాద్ చైర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజమ్ సంయుక్త ఆధ్వర్యంలో మౌలానాఅబుల్ కలామ్ ఆజాద్‌పై రెండవ రోజు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా న్యూఢిల్లీలోని ఎన్‌యూఈపీఏ ప్రొఫెసర్ సయ్యద్ ఇర్ఫాన్ హబీబ్ రచించిన «మౌలానా ఆజాద్ ఏ లైఫ్» పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ప్రొఫెసర్ అమీర్‌అలీ మాట్లాడుతూ భారతదేశంలోనే మౌలానా ఆజాద్ గొప్ప రాజనీతిజ్ఞుడుగా గుర్తింపు పొందారని గుర్తు చేశారు. మనం అధికారం గురించి ఎలా ఆలోచించాలో అందరికీ దిశా నిర్దేశం చేశారన్నారు. ఈ సమావేశంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్, ప్రొఫెసర్ షొన్నా రోడ్రిగ్స్, ప్రొఫెసర్ సయ్యద్ ఇంతియాజ్, ప్రొఫెసర్ మహ్మద్ సజ్జాద్ పాల్గొన్నారు.

మౌలిక వసతులకు పెద్దపీట వేస్తా



నందమూరినగర్‌లో పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ నందమూరినగర్‌లో చేపడుతున్న సీసీ రోడ్డు, వరదనీటి కాలువ నిర్మాణ పనులను శుక్రవారం కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామన్నారు. సీసీ రోడ్డు, వరద నీటి కాలువల అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలన్నారు. నాణ్యత విషయంలో రాజీ పడవద్దని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఏఈ రాజీవ్, డివిజన్ ఉపాధ్యక్షుడు పోతుల రాజేందర్, కాలనీవాసులు వెంకట్‌రావు, నాగవర ప్రసాద్, అంజయ్య, కోటిరెడ్డి, శ్రీనివాసరావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సర్వాయి పాపన్నగౌడ్ జయంతి



పాపన్నగౌడ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ సత్యనారాయణ

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి సందర్భంగా శుక్రవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్లు, వివిధ పార్టీల నాయకులు ఆయన చిత్రపటాలు, విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ తెలంగాణ వీరత్వానికి, పరాక్రమానికి ప్రతీక అని కొనియాడారు. సబ్బండ వర్గాల ఆత్మగౌరవానికి స్ఫూర్తిగా నిలిచిన మహోన్నత వ్యక్తి అని అన్నారు. ఆనాటి సమాజంలో నెలకొన్న రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా సబ్బండ వర్గాలను ఏకం చేసి ఆయన పోరాడిన తీరు గొప్పదని గుర్తు చేసుకున్నారు.



నివాళులర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు తదితరులు

శుభోదయ కాలనీ సమస్యలను పరిష్కరిస్తా



స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

భాగ్యనగర్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ శుభోదయకాలనీలో శుక్రవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్‌గౌడ్, ఉప్పలపాటి శ్రీకాంత్, అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శుభోదయ కాలనీలో రోడ్లు పునరుద్ధరించాలని, నిత్యం వాహనాలతో ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులకు గురి అవుతున్నామని, అదే విధంగా ఒక డివైడర్ ఏర్పాటు చేయాలని స్థానికులు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఇప్పటికే కాలనీలో అన్ని మౌలిక వసతులు కల్పించామన్నారు. కాలనీవాసులు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని త్వరలో డివైడర్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ట్రాఫిక్, రోడ్డు సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు ఏఈ శ్రావణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, నాయకులు కాశీనాథ్‌యాదవ్, సాయిగౌడ్, కాలనీవాసులు అల్లురయ్యా, సర్వయ్య తదితరులు పాల్గొన్నారు.

త్వరలో ఎఫ్‌ఓబీ, పాఠశాల భవన నిర్మాణం

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ బస్‌స్టాప్ దగ్గర ఫుట్ ఓవర్ బ్రిడ్జి (ఎఫ్‌ఓబీ), శిథిలావస్థలో ఉన్న ప్రాథమిక పాఠశాల భవనాన్ని తొలగించి నూతన భవనం నిర్మించాలని బీఆర్ఎస్ నాయకుడు సిందం శ్రీకాంత్ శుక్రవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకి వినతిపత్రం అందజేశారు. గతంలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి లేక 5 మంది యాక్సిడెంట్‌లో చనిపోయారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే వాటి నిర్మాణానికి అనుమతులు వచ్చాయని త్వరలో నిర్మాణాలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణమాస శుక్రవార పూజలు



ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ ఫేజ్ టులోని భ్రమరాంబ మల్లికార్జునస్వామి దేవాలయంలో శ్రావణ మాస తొలి శుక్రవారం పురస్కరించుకొని లక్ష గాజులతో మంగళగౌరిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త శ్యామల భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు అక్కినేశ్వర శర్మ వేదమంత్రాల సాక్షిగా అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, లలిత సహస్రనామాలను పఠించారు. ముత్తయిదువులకు వాయినాలు అందించి ఆశీర్వాదాలు తీసుకున్నారు.

ముగిసిన జీవవైవిధ్య సంరక్షణ సదస్సు

గచ్చిబౌలి: పర్యావరణ పరిరక్షణ శిక్షణ, పరిశోధనా సంస్థ(ఈపీటీఆర్ఐ)లో నిర్వహించిన రెండు రోజుల సదస్సు శుక్రవారం ముగిసింది. తెలంగాణ జీవవైవిధ్య మండలి ఆర్థిక సహకారంతో తెలంగాణ రాష్ట్ర డిగ్రీ కళాశాల అధ్యాపకులు 40 మందికి జీవవైవిధ్య సంరక్షణ అనే అంశంపై రెండు రోజుల సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని ప్రపంచ జీవ వైవిధ్య ప్రణాళిక, కార్యాచరణ, ప్రజా జీవ వైవిధ్య రిజిష్టర్ తయారీ, ప్రయోజన భాగస్వామ్యం, మందు మొక్కల ఉద్యానవనం తయారీ, అటవీ సంపదను అంచనా వేయడం, అంతరించిపోతున్న వృక్షాలను వాటి కణజాల వర్ధనంలో తిరిగి పెంపొందించడానికి తీసుకునే చర్యలను ఈపీటీఆర్ఐ డైరెక్టర్ జనరల్ వాణీప్రసాద్ వివరించారు. సీనియర్ ఐఏఎస్ అధికారులు కాళీచరణ్ కర్డే, వాకాటి కరుణ ఆధ్వర్యంలో సదస్సులో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో అధికారులు డా.సునీల, డా.జ్యోతి, డా.వీరాంజనేయులు, ప్రశాంతి పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్లు ఇవ్వకుండా కాలయాపన

- ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా బీజేపీ నిరసన
- రాస్తారోకో నిర్వహించి సర్కారుపై నినాదాలు
- నాయకులను అరెస్టు చేసిన పోలీసులు



మూసాపేటలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కేటాయించాలని రాస్తారోకో నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు పన్నాల హరీష్‌రెడ్డి, వడ్డేపల్లి రాజేశ్వరరావు

మూసాపేట: అర్హులైన లబ్ధిదారులకు వెంటనే డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని బీజేపీ నాయకులు శుక్రవారం మూసాపేటలో నిరసన దీక్ష, రాస్తారోకో చేపట్టారు. మేడ్చల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు, నాయకులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నిరసన తెలుపుతున్న నేతలను పోలీసులు అరెస్టు చేసి సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

◆ ఎన్నికలు వస్తున్నాయని.. ప్రజలు గుర్తుకువస్తున్నారు..

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇస్తామని చెప్పి 9 సంవత్సరాలుగా ప్రభుత్వం కాలయాపన చేస్తోందన్నారు. ఎన్నికల సమయంలో హడావిడి చేసి తరువాత పేదలను పట్టించుకోవటం లేదని ఆరోపించారు. కేవలం ఎన్నికల సమయంలోనే ప్రజలు గుర్తుకు వస్తున్నారని విమర్శించారు. అర్హులైన నిరుపేదల కుటుంబాలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వకపోవటంపై కారణాలు ఏమిటో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

◆ రానున్న రోజుల్లో బీఆర్ఎస్‌కు గుణపాఠం తప్పదు..

అనేకమార్లు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నా సర్వేల పేరుతో అప్పుడు, ఇప్పుడు ఇస్తామంటూ కాలయాపన చేస్తూ వచ్చారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో వారికి ప్రజలు బీఆర్ఎస్‌కు తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మూసాపేట కార్పొరేటర్ కోడిచెర్ల మహేందర్, రాష్ట్రకార్యవర్గ సభ్యుడు అర్కపల్లి సూర్యారావు, శరణ్‌కుమార్, కూకట్‌పల్లి అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్‌రావు, డివిజన్ అధ్యక్షుడు శ్రీకర్‌రావు, పూలాకి కిషోర్, పద్మయ్య తదితరులు పాల్గొన్నారు.



నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

బీజేపీ భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు ముమ్మరం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి మెట్రో హుడా ట్రక్ పార్కింగ్ వద్ద బీజేపీ భారీ బహిరంగ సభ ఆదివారం సాయంత్రం 3.30 గంటలకు నిర్వహించనున్నారు. ఈ సభలో ప్రముఖ నాయకులు పార్టీలో చేరనున్నట్లు బీజేపీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా బహిరంగ సభ జరిగే ప్రాంతాన్ని శుక్రవారం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు, బీజేపీ సీనియర్ నాయకులు పరిశీలించారు. ఈ బహిరంగ సభకు కూకట్‌పల్లి నియోజకవర్గ బీజేపీ నాయకులు, కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

బీజేపీలోకి ముమ్మారెడ్డి ప్రేమకుమార్...



ఆదివారం జరగనున్న బీజేపీ బహిరంగ సభలో కూకట్‌పల్లి నియోజవర్గానికి చెందిన ప్రముఖ సంఘ సేవకులు లయన్.డా. ముమ్మారెడ్డి ప్రేమకుమార్ పార్టీలో చేరనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత రాష్ట్ర పాలనలో ఏ వర్గ ప్రజలు కూడా సంతోషంగా లేరన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు ఆకర్షితుడినై బీజేపీలో చేరాలని నిర్ణయించుకున్నానని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ తెలంగాణలో విజయం సాధించడం ఖాయమన్నారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వ ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానన్నారు.



కూకట్‌పల్లి హుడా ట్రక్ పార్కులో సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న హరీష్‌రెడ్డి, రాజేశ్వరరావు